# ఆశలు అడుగంటి పోయాయి ....

* రచన: శ్రీ. అడపా రామకృష్ణశ్రీ. *

బాబూ!......

నీవు హైద్రాబాదు వెళ్ళిన దగ్గర నుండి నా హృదయావేదన మితిమీరిపోతుంది. మళ్ళీ నీతో ఆనందంగా ముచ్చటగా దగ్గర కూర్చో పెట్టుకొని ముద్దుగా పలకరించాలని నా హృదయసీమ అనంతసాగరములో తేలియాడుతూ యిప్పుడు ఆనందభాష్పములతో ఉరక లేస్తుంది. నీవెళ్ళినప్పటినుండి నా మనస్సు సముద్రం ఘోషిస్తున్నట్లుగా నీపై మనస్సు నిలుపుతూ ఏ పనిలో పాల్గొనలేక ఆవేశంతో సతమతమౌతూ, తూలుతు నీ కోసం తొంగి చూస్తున్నాను. నీ మాతృహృదయం ఎంత ఉదారతయో, ఎంతటి ప్రేమమూర్తియో నీ వెరుగవా బాబు?

నీవు ఈ ప్రదేశం నుండి బయలుదేరక మునుపు నీకాసీటు దొరుకుతుందో లేదో నను భయంచేత నేనెంతమంది దేవతలకు, దేవుళ్ళకు మొక్కుకున్నానో నీకు తెలియదు. ఆ దైవకటాక్షమే నేడు మనకు జీవనయాత్రగా రూపొందుతుంది.

నీకెప్పుడైతే ఆ ''యింజనీరింగు'' సీటు దొరికిందో నీ మాతృమూర్తి ఆనందంతో ఏకాగ్రతతో దేవిని పరిపూర్ణ భక్తితో సేవించింది. తోటివారితో తానొక గొప్పపదవిలో అలంకరింపబడుతున్నానని అందరి నోటా పాటలా వినిపించాను. బాబూ...ఇదే ఈ సంవత్సరానికి చివరిలేఖ. దీనితో నువ్వు పరీక్షలలో. విజయసంపాదించి ఆకాశంలో దీపం వెలిగిస్తావని ఆశిస్తున్నాను.

ఇదే విజయంతో నీవొక ప్రజోద్దారకుడవై అందరి యెడల యశము సంపాదించాలి. దైవం నిష్పక్షపాతంగా సృష్టిలో కుంభకోణం జరుగదు. కాని చావు బ్రతుకుల సందిగ్ధంలో పడి సతమతమై పోతాం. ప్రపంచంలో సంపాదించి కీర్తిశేషులైనవారే పూజ్యులు. వారికే జీవిత మనుగడ సార్థక మౌతుంది.

బాబూ నేనెంతో వ్రాసాను. నీకు తల నొప్పెట్టవచ్చును. కాని ఈ లేఖ ముగించే ముందు ముఖ్యమైన విషయములతో ముగిస్తాను. నీవు చిన్నప్పుడు బాల్యచాపల్యముతో ఆటలు ఆడేవాడివి. ఎవరితోనో ఒక్క నిముషం ఆలోచించు. నీపై యాశలు ఆశయాలు మేమంతా నిలుపుకున్నాము. బాల్య స్మృతులు ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకో! నిన్ను బావా అంటే భగ్గునమండేవాడివి. తిరిగి పళ్ళు ఎత్తుదానా అని వెక్కిరించిచేవాడివి. కాని అదే మనస్సు జీవితకాలమంతా వుండదు. కాలంమార్పునుబట్టి మనుష్యుల మనసులు మారుతాయి. ఆలక్ష్మిపై నీకు మనస్సుఉండే వుంటుంది. బాగా ఆలోచించుకో!! నీవు బయలుదేరే ముందు ఉత్తరం వ్రాయి, ముఖ్యంగా ఈవిషయాన్ని సమర్థిస్తూ వ్రాయి. నేను జీవించియుండగా-నీవు మహోన్నతమైన స్థానంలో నుండగా అక్షింతలు వేయాలని వుంది.

ఇట్లు

నీ మాత్రుహృదయం నుండి.

లేఖ చేతిలోనుండి జారిపోయింది. చివరి మాటలు వినగానే రామం హృదయం కంపించి పోయింది. ఎవరో తన ఆనందమైన జీవితాన్ని శూలాలతో త్రుంచివేస్తున్నారు. కారుచిచ్చులలో తగలవేస్తున్నారు. కళ్ళు చెమ్మగిల్లి పోయాయి. తను జీవితమంతా ఎంతో సంతోషంతో గడపాలని తన కోర్కెలన్నీ కలహంసలా అనుభవించాలని ఆశ పెట్టుకున్నాను నాయాశలన్నీ అడియాశలేనా! ఛ...ఛ...ఈ మానవజీవితంలో ఆశలనేవి లేకుంటే ఎంత బాగుండేది.

నాతో ఈపెళ్ళి జరగకూడదు. జరిగినా నేను జీవించి యుండగా జరగనివ్వను. ఎదుటవారు ఎంత ధనవంతులైతే మాత్రం తాననుభవించవలసిన జీవనయాత్ర సాగవద్దూ ఎలాగైనా ఈపెళ్ళిని అరికట్టాలి.. అరికట్టాలి... అనుకొంటూ ఆదరబాదరతో ఉక్కిరిబిక్కిరై పోయాడు రామం. అలసట పోయిన కొంతసేపటికి ఉత్తరం వ్రాయసాగాడు.

లక్ష్మీ...!

యేనాడైతే నేను వైజాగ్ విడిచివెళ్ళానో ఆనాటివరకు నీలో యింత దురాలోచన యిమిడి యింతటి క్లిష్ట పరిస్థితిని తెస్తావనుకోలేదు. దురహంకారముతో యిలాంటి దుర్బుద్ధితో అవనీతిగా నా దగ్గర మెలిగా వనుకోలేదు. నేను అనుమానించలేనిది ఈనాడు నిజం తెలుసుకుంటూ ఉక్కిరిబిక్కిరై హృదయంలో ఊరిపోసుకుంటున్నాను. చెల్లెలుగదాయని కలసి మెలసియున్నాను. ఈనాడు కన్నీటితో కరిగిపోతున్నాను. సొంత తోబుట్టువు లేకపోయినా యిన్నాళ్ళంతా ఆనందంతో నాకొక చెల్లెలున్నాదని కలలు కన్నాను. ఆ అవనీతి హృదయమే చెడదారినిపట్టి చెడ్డమద్దులతో ప్రవర్తిస్తున్నదని నాకెన్నడూ అభిప్రాయం కాని, అనుమానం కాని కలుగలేదు. జాగ్రత్త! యిలాంటి దుష్టమైన బుద్ధులతో దుందుభీలు ప్రయోగించుకోకు. జీవితంలో ఈ మొదటి మెట్టు పేకముఖం వంటిది.

ఇట్లు
నీ సోదరుడు...

ఉత్తరం చదివాక లక్ష్మీహృదయం అతివేగంగా కొట్టుకొనసాగింది. ప్రపంచమంతా శూన్యంలా గోచరిస్తుంది. అంతే...నిలువునా నిలబడి, నిటారుకొమ్మ నేలకూలినట్లు లక్ష్మి కుర్చీపై కూలిపోయింది.

కొండంతగా పెట్టుకున్న పెద్దల యాశలు నేలపాలు చేసింది టెలిగ్రాం అందుకున్న రామం హృదయంలో చిచ్చు వేసింది.

ప్రపంచం మందు నా భవిష్యత్తులో నేనొక స్త్రీని నాకేదోహక్కున్నట్లుగా అమాంతంగా బలి చేశాను. జీవితంలో యింత చిన్న విషయంకోసం అనుమానాలతో ఆగ్రహించి గురి చేశాను. నా ఆశలు నెరవేరక పోయినా ఒక అబలను అంతం చేశాను. ఛీ......నేనెంత గుడ్డివాడిని. తోటివారి బ్రతుకును నులిపి కాలువేసి రాసి నశింపజేశాను. ఈ అంతరంగం మాత్రము నన్నూరుకోదు. ఈదౌర్భాగ్యపు జీవితంపై నాకిక ఆశలేదు. ఆశలు అగ్నిలో ఆహుతై పోయాయి అంటూన్న రామం ప్రాణాలు హఠాత్తుగా ఆగిపోయాయి. మానవుడి ఆశలు అడుగంటి పోతున్నాయి కదాయని కాలచక్రం తొంగిచూస్తూనవ్వుతూ తనకార్యక్రమం కొనసాగించుకొంటుంది.